క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే


హైదరాబాద్‌లో ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణ రావు సంతాప సభను శుక్రవారం తిరుమలగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి మాట్లాడారు. దొడ్డా నారాయణరావు మృతి సీపీఐకి, వామపక్ష ఉద్యమానికి, పేద ప్రజలకు తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్‌డీ ఫయాజ్ మియా, రైతు సంఘం జిల్లా సహాయక కార్యదర్శి తిపిరాల శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జంపాల మల్లయ్య, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ ఇస్లావత్ మనోజ్ కుమార్, సుంచు సత్తయ్య, కందుకూరి రవి, జంపాల శీను పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

మద్దిరాల : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో పరిశుభ్రత, జనన, మరణాల నమోదు, బాల్య వివాహాలను అరికట్టడం, స్వచ్ఛత, తదితర పలు అభివృద్ధి పనులపై వివరాలు సేకరించి ర్యాంకింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. మంచి ర్యాంకు పొందిన గ్రామాలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికవుతాయని పేర్కొన్నారు. గ్రామాలకు జాతీయ అవార్డులు వచ్చేలా పని చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అమూల్య, ఐబీఏఈ శ్రావణి, ఏపీఎం మైసయ్య, హెడ్ కానిస్టేబుల్ వీరస్వామి పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం అందించే నూతన రేషన్ కార్డులను మండల కేంద్రంలో లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ హరికిషోర్‌శర్మ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి 429 నూతన రేషన్ కార్డులు, 919 కుటుంబ సభ్యుల నమోదు కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ఆయనతో పాటు డీటీ షాహిన్‌బేగం, సీనియర్ అసిస్టెంట్ షఫీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి, సూర్యాపేట రైతులకు కాళేశ్వరం నీళ్లిచ్చి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఫ్లెక్సీలతో విచిత్ర వేషధారణలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే కాళేశ్వరం జలాలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు మట్టిపెల్లి శ్రీశైలం, దొంగరి శ్రీనివాస్, గోపగాని రమేష్ గౌడ్, మల్యాల రాములు, గుడిపాటి వీరయ్య, కడారి దాసు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందజేయాలి

చివ్వెంల : తమ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సిబ్బంది ఎంపీడీఓ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఇరుగు నాగయ్య, ఈసీ జ్యోతి, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

జలం.. ఒడిసిపడితే పదిలం!

- భూగర్భజలాల పెంపునకు ఇంకుడు గుంతలు దోహదం
- ఉపాధి హామీ పథకం కింద నిర్మించుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన


అనంతారంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

పెన్‌పహాడ్ : నీటి సమస్య నుంచి బయటపడేందుకు, భవిష్యత్ జల సంక్షోభాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వర్షాభావ పరిస్థితులు, వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. ప్రస్తుతం చాలా గ్రామాల్లో బావులు, వాగులు, కుంటలు, రక్షిత మంచినీటి పథకాలు, చేతి పంపులు, బోరుబావుల్లో నీరు లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ఇంకుడు గుంతల నిర్మాణం అత్యవసరం. ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మించుకుంటే రూ.6వేల వరకు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.14వేలు, గ్రామాల్లో బోరుబావుల వద్ద నిర్మించుకుంటే రూ.30వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది.

ఇంకుడు గుంతల ఆవశ్యకత..

భవిష్యత్తులో భూగర్భ జలమట్టం మరింత పడిపోయి నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. ఈ ముప్పును నివారించేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జల మట్టం పెరుగుతుంది. అంతేకాకుండా ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరు వీధుల్లోకి చేరి నిలువకుండా ఇంకుడు గుంతల్లోకి వెళ్లడం వల్ల పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది. ఇది దోమల వృద్ధిని అరికట్టి, తద్వారా రోగాల బారిన పడకుండా ప్రజలను కాపాడుతుంది.

నిర్మాణ ప్రమాణాలు..

ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలకు.. పొడవు 1.2 మీటర్లు, వెడల్పు 1.2 మీటర్లు, లోతు 1.8 మీటర్లు ఉండాలి. బాత్రూమ్ వద్ద పైప్‌లైన్ ఏర్పాటు చేసి మురుగు నీరంతా ఇంకుడు గుంతలోకి వెళ్లేలా చూసుకోవాలి. అలాగే గ్రామాల్లో బోర్ల వద్ద ఇంకుడు గుంతలకు.. పొడవు, వెడల్పు, లోతు 2 మీటర్ల చొప్పున ఉండాలి. ప్రతి మండలానికి వంద చొప్పున ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, అలాగే ప్రతి పంచాయతీకి ఒకటి లేదా రెండు చొప్పున మురుగు కాలువల ముగింపు వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని అధికారులు సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా అనంతారం గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

దరఖాస్తు విధానం..

ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలి అనుకునే వారు తమ జాబ్‌కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీ తీర్మానాన్ని ఈజీఎస్ (ఉపాధి హామీ పథకం) కార్యాలయంలో సమర్పించాలి. ఆ తర్వాత అధికారులు స్థలాన్ని పరిశీలిస్తారు. నిర్మాణం పూర్తయిన వెంటనే ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. గ్రామాల్లో నిర్మించే పబ్లిక్ ఇంకుడు గుంతల నిర్మాణానికి కూడా పంచాయతీ తీర్మానం అవసరం. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, సామూహికంగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, తద్వారా భూగర్భ జలాలను పెంపొందించి, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలని ప్రభుత్వం సూచిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా డబ్బులు అందజేస్తుంది. గ్రామాల్లో ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రవి, ఏపీఓ

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు


అనంతారంలో నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

పెన్‌పహాడ్ : భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామాన్ని స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎంపిక చేయడంతో శుక్రవారం గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. ఇంటింటికీ ఇంకుడు గుంతలు, రీచార్జ్ స్ట్రక్చర్లను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. భూ భారతి దరఖాస్తులను ఆగస్టు 14వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ జానయ్య, ఏపీవో రవి, ఏపీఎం అజయ్‌నాయక్, ఈసీ మహేష్, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదు

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి


మాట్లాడుతున్న కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : పట్టణంలో పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. శుక్రవారం 100 రోజుల పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 41వ వార్డులో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి వీధి, ప్రతి కాలనీ శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. వార్డులో డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా, దోమల ఉధృతి వంటి అంశాలపై ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమన్వయంతో సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ముందడుగు వేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ షఫీ ఉల్లా, అయూబ్ ఖాన్, కుమ్మరికుంట్ల లింగయ్య, ఏఈ తిరుమలయ్య, వార్డు అధికారి సామగాని శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, టీఎంసీ శ్వేత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


సూర్యాపేట అర్బన్ : ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ హనుమంత రెడ్డి


తిరుమలగిరిలోని హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

సూర్యాపేట అర్బన్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ వసతి గృహంను సందర్శించారు. హాస్టల్ విద్యార్థుల, వార్డెన్, సిబ్బంది హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను, స్టోర్, వంట గది, విద్యార్థుల గదులను, బాత్ రూంలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తమకు ఏమైనా సమస్యలు ఉంటే హాస్టల్‌లో పెట్టిన ఫిర్యాదు పెట్టెలో రాసి వేయాలని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. విద్యార్థులు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జి, వార్డెన్ ముత్యాల రావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ఎండీ గౌసుద్దీన్, ఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్, ఇండ్ల మనోజ్ కుమార్, యాదగిరి, శివ శంకర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం, మోడల్ స్కూల్‌లలో హాస్టళ్లను తహసీల్దార్ హరిప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నూతనకల్: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ప్రభుత్వం సూచించిన మెనూను ఉల్లంఘించి స్వలాభం కోసం పనిచేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

సూర్యాపేటటౌన్ : ఆటోలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లకు లైసెన్స్ ఇప్పించడం కోసం డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ వరకు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదు చేసుకునేవారు రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, పదో తరగతి మెమో లేదా పాన్ కార్డు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సాయిరాం సెల్ 87126 86034ను సంప్రదించాలని సూచించారు.

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు


వట్టిఖమ్మంపహాడ్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

చివ్వెంల : ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి చిలుక రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని కుడకుడ, వట్టిఖమ్మంపహాడ్, ఐలాపురం, కోమటికుంట, బి.చందుపట్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో 40 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు టీచర్లు ఉండాలని, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు టైమ్ స్కేల్ ప్రకటించాలని, 29 రోజుల సమ్మె కాలానికి వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి.దయాకర్, ఎస్.శంకర్, ఎస్.సైదా, బి.సైమన్, బి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని వినతి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట : ఉపాధ్యాయురాలిని ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీహరిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు నాగు నాయక్ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్న గిరిజన ఉపాధ్యాయురాలు సుకన్యను కులం పేరుతో దూషిస్తూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిల్లుట్ల శ్రీహరి మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. జిల్లా అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి, వేధింపులకు పాల్పడుతున్న ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్‌ఎస్ జిల్లా గౌరవ సలహాదారుడు బానోతు పులియా నాయక్, పట్టణ అధ్యక్షుడు భూక్యా మహేష్ నాయక్, వీవీ నాయక్, రఘు నాయక్, శంకర్ నాయక్, రవీందర్ నాయక్, బానోతు రవీందర్ నాయక్, మోహన్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన


సూర్యాపేట టౌన్ : జెడ్పీహెచ్ బాలుర పాఠశాలలో మాట్లాడుతున్న మహ్మద్ రఫియుద్దీన్


నాగారం : వర్ధమానుకోట కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ వాసం ప్రభాకర్


తుంగతుర్తి : ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లింగమూర్తి

సూర్యాపేటటౌన్ : ప్రతి ఒక్కరి ఇంట్లో ఔషధ మొక్కలు ఉండాలని, ప్రతి విద్యార్థికి ఔషధ మొక్కలపై అవగాహన ఉండాలని రిటైర్డు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహ్మద్ రఫియుద్దీన్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఔషధ వనం, కూరగాయల తోటలు, ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సీజీఆర్ అడ్మిన్ ఆఫీసర్ అనుదీప్ మాట్లాడారు. ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్, ఔషధ వనం, కూరగాయల తోటలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ, మెంటార్ టీచర్ విశ్వబ్రహ్మచారి, సీజీఆర్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకరయ్య, కత్తి కోటయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతులకు హాజరై మాట్లాడారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఈటూరు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం, పేదరికం, విద్య, సమాజం, ఆడపిల్లల చదువు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎండీ షరీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తుంగతుర్తి : విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని డాక్టర్ లింగమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్– కళాశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కలుషితమైన నీరు, ఆహారం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, నీళ్లు కాచి వడబోసి తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమన్న, నర్సింహాచారి, యాదగిరి, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ అరుణ, మంజుల, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు


చివ్వెంల : జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

సూర్యాపేట : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం బాలెంలలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, జిల్లా, మండల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని 33వ వార్డు ఇన్‌చార్జ్ మీలా వంశీ స్వాతి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తలకోట లక్ష్మయ్య, వెంపటి శబరినాథ్, మంచాల శ్రీనివాస్ గుప్తా, శ్రీరంగం రాము, యామ సంతోష్ పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జూలకంటి జీవన్ రెడ్డి, రౌతు నర్సింహారావు, జూలకంటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో..

జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణం ఎదుట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, నల్లకుంట్ల అయోధ్య, గొండ్రాల అశోక్, నాతి సవీందర్ కుమార్, శ్రవణ్ కుమార్, తోగటి మురళి, వెంకట్ రెడ్డి, గ్రంధి వెంకటేశ్వర్లు, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చార్లెట్ హోమ్ అనాథాశ్రమంలో అన్నదానం

జగదీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా దురాజ్‌పల్లి గ్రామ ఆవాసం రామ్‌కోటి తండాలోని చార్లెట్ హోమ్ అనాథాశ్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. దుప్పట్లు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

తిరుమలగిరి : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం తిరుమలగిరిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, జిల్లా నాయకులు సంకేపల్లి నరోత్తంరెడ్డి, దూపటి రవి గౌడ్, కందుకూరు బాబు, షకీల్, సురేందర్, బర్ల వెంకన్న, మోడెపు వీరన్న పాల్గొన్నారు.

నూతనకల్ : జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్, తొనుకునూరి సైదులుగౌడ్, లింగరాజు పాల్గొన్నారు.

మద్దిరాల : జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రజాక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిలకర చంద్రమౌళి, వడ్డాణం మధుసూదన్, కొలగాని వెంకన్న, బద్దం అమృతరెడ్డి, నల్ల మధు, పల్లా శ్రీకాంత్, శ్రీను, పొన్నం పెద్ద గండయ్య పాల్గొన్నారు.

నాగారం : జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామమైన నాగారంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గుంటకండ్ల రామచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్యగౌడ్, దోమల బాలమల్లు, యారాల రాంరెడ్డి, కూరం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జగదీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం అర్వపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, మొరిశెట్టి ఉపేందర్, డాక్టర్ రామకోటి, కోటమర్తి మల్లయ్య, ఎల్లంరాజు, గోసుల విజయ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నెమ్మికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు తూడి నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ గోపగాని వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బెల్లంకొండ యాదగిరి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం, నాగులపహాడ్, నాగులపాటి అన్నారం గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, ఉప్పల ఆనంద్, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, దంతాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలతో నిత్యం ప్రమాదాలు


రోడ్డుపై గుంతల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు

సూర్యాపేట: సూర్యాపేట బస్టాండ్ నుంచి ఐలాపురం ఎక్స్‌రోడ్ వరకు ఉన్న కుడకుడ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. రోడ్డుపై గుంతలను పూడ్చి, రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కుడకుడ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. సూర్యాపేట నుంచి దంతాలపల్లి మార్గంలో ఉన్న ఈ రోడ్డు గుంతలమయమై, ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నాయని, నాణ్యత లోపం కారణంగా ఏర్పడిన గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చి, నాలుగు లైన్ల రహదారిగా మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనుల కోసం తవ్విన రోడ్లను సరిగా పూడ్చకపోవడం వల్ల కాలనీలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పూడ్చాలని ఆయన కోరారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న పోలెబోయిన కిరణ్

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగే పాఠశాలలు, జూనియర్ కళాశాల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల లేమి, మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు భార్గవ్, రహీం, పార్థు, అజీముద్దీన్, జీవన్, లక్ష్మణ్, యాసిన్, పండు, శంకర్, నవదీప్, కౌశిక్, భరత్, తేజ, విక్రమ్, నదీర్ తదితరులు పాల్గొన్నారు.